సాక్షి
నిర్మల్
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023



బాసర-ముఖేడ్ ఎలక్ట్రికల్ లైన్ పూర్తి

బాసర-ముఖేడ్ రైల్వేస్టేషన్ల మధ్య 57 కిలో మీటర్ల మేర ఎలక్ట్రికల్ లైన్ పనులు పూర్తయ్యాయి. రెండ్రోజుల క్రితం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. 10లో▸

మంత్రిని కలిసిన డీపీఆర్వో



నిర్మల్‌టౌన్: ఇటీవల డీపీఆర్వోగా ప్రమోషన్ పొందిన తిరుమల బుధవారం మంత్రి ఐకేరెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా తిరుమలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: రాంపూర్, మైసంపేట గ్రామస్తులకు నచ్చన్‌ఎల్లాపూర్‌లో చేపట్టిన పునరావాస ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పునరావాస వసతులపై ఆయన బుధవారం సమీకృత కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో డీఎఫ్‌వో రాంకిషన్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాంపూర్, మైసంపేట గ్రామస్తుల కోసం 94 ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, విద్యుత్, తాగునీటి వసతులు, ప్లాంటేషన్ ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణంలోని గృహాలకు ఒకే రకం రంగులు వేయాలని, అంగన్‌వాడీ భవనంలో కార్టూన్లు, దేశ నాయకుల చిత్రాలు వేయించాలని సూచించారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. నర్సాపూర్ మండలం కేంద్రం, రాంపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ సంఘం నాయకులు పార్టీలో చేరగా మంత్రి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు.

కాంగ్రెస్ 'విజయభేరి' సమన్వయకర్తలు వీరే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ ఈ నెల 17న హైదరాబాద్ శివారులోని తుక్కుగూడలో నిర్వహించనున్న విజయభేరి బహిరంగ సభ విజయవంతానికి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నూరు నియోజకవర్గానికి ఇర్ఫాన్ అలీ, బెల్లంపల్లికి అనిల్‌కుమార్, ఆసిఫాబాద్‌కు హైమావతి, ఖానాపూర్‌కు బీ సత్తుమల్లేశ్, నిర్మల్‌కు బీ జనక్‌ప్రసాద్, ముధోల్‌కు అబ్దుల్ ఎజాజ్‌ను నియమించారు. వీరు ఆయా నియోజకవర్గాల్లో బహిరంగ సభ విజయవంతం చేసేందుకు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకోనున్నారు. కాగా, మంచిర్యాల, సిర్పూర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు ఎవరినీ నియమించలేదు.

సమ్మె విరమించిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు



సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటిస్తున్న ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: డైరెక్టర్ ఆఫ్ హెల్త్ జీ శ్రీనివాస్‌తో తమ నాయకులు భూపాల్, యాద నాయక్, సాదుల్లా జరిపిన చర్చలు సఫలం కావడంతో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగులు సమ్మె విరమిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమ్మె శిబిరం వద్ద మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి విన్నవిస్తానని, జీతాల పెరుగుదలకు కమిటీ వేసి పరిష్కరిస్తామని శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు సురేశ్ తెలిపారు.

'అనుమతి తప్పనిసరి'

నిర్మల్‌చైన్‌గేట్: వినాయక మండపాలకు వినియోగించే విద్యుత్‌కు అనుమతి తప్పనిసరి అని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. కిలోవాట్ లోడ్‌కు రూ.1,560, కిలోవాట్ నుంచి 1.5 కిలోవాట్స్ వరకు రూ.2,300, 1.5 నుంచి రెండు కిలోవాట్స్ వరకు రూ.3,020, రెండు కిలోవాట్స్ పైన రూ.3,020తో పాటు రూ.1,560 డీడీ ప్రతి అదనపు కిలోవాట్ లోడ్‌కు చెల్లించాలని పేర్కొన్నారు. చెల్లించిన రుసుం 10 రోజుల వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.

నిరీక్షించి.. నీరసించి..!



- అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ
- ఆశావహుల్లో కనిపించని సమరోత్సాహం
- ఖర్చు పెట్టేందుకు నేతల వెనుకడుగు
- జాబితా ప్రకటించగా బీఆర్‌ఎస్‌లో జోష్

నిర్మల్: ఐదేళ్ల పాలన గడువు లెక్కలోకి తీసుకుంటే అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలలే గడువుంది. మరోవైపు ప్రధాన ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికీ తమ అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఎప్పుడూ లేనట్లుగా ఈసారి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించాయి. వాటి పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయింది. కానీ.. ఇప్పటికీ రెండు పార్టీలూ తమ అభ్యర్థులను ఖరారు చేయడం లేదు. మరోవైపు తమలో ఎవరికి టికెట్ వస్తుందో.. ఎవరికి మొండి చేయి చూపుతారో.. తెలియక ఈ రెండు పార్టీల ఆశావహులు ఎదురుచూస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియకు ముందు యాక్టివ్‌గా ఉన్న పలువురు నేతలు ప్రస్తుతం చల్లబడ్డారు. ఇప్పటివరకు చేసింది చాలు.. ఇక అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత చూసుకుందాం.. అనే తీరుగా ఆలోచిస్తున్నారు. ఈక్రమంలోనే ఖర్చులూ ఆచితూచి చేస్తున్నట్లు వారి క్యాడర్ చెబుతోంది.

ఎవరికి వస్తుందో ఏమో..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీల నుంచి ఆశావహులు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీలో ఒక్క ముధోల్ నుంచి 15–20మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు. ఇందులో ప్రధానంగా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సీనియర్లు రామారావుపటేల్, మోహన్‌రావు పటేల్, యువనేత బాజీరావుపటేల్ విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇక్కడ కాంగ్రెస్ నుంచి ప్రధానంగా డాక్టర్ కిరణ్‌కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది. సీనియర్ నేత ఆనంద్‌రావు పటేల్ కూడా ఆశ పెట్టుకున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు దరఖాస్తు చేసుకున్నా ఇక్కడ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికే టికెట్ వస్తుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్ నుంచి కూడా పలువురు సీనియర్లు అప్లికేషన్లు ఇచ్చినప్పటికీ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకే టికెట్ దక్కుతుందని హస్తంవర్గాలు వ్యక్తంజేస్తున్నాయి. ఖానాపూర్‌లో మాత్రం బీజేపీలో మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానకీబాయి తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లోనూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ప్రస్తుత ఎమ్మెల్యే రేఖానాయక్, భరత్‌చౌహాన్‌ల మధ్య పోటాపోటీ ఉంది.

టికెట్ వచ్చేదాకా..

జిల్లాలో ఆశావహుల్లో చాలామంది ఒక్కసారిగా చల్లబడ్డట్లు కనిపిస్తున్నారు. పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసిన తర్వాత కొంతమంది ప్రజల్లోకి వెళ్లడం తగ్గించినట్లు కనిపిస్తోంది. 'ఎలాగూ టికెట్ నేరుగా ఇవ్వడం లేదు.. దరఖాస్తులను పరిశీలించిన తర్వాతే ఇస్తారు.. ఇక అప్పటి దాకా వేచి చూద్దాం..' అనే ధోరణిలో ఉన్నారు. టికెట్ వస్తుందని ముందే సమాచారం ఉంటే కాసింత ఖర్చుచేసి ప్రచారం చేసుకున్నా ప్రయోజనం.. లేనిపక్షంలో ఉత్తిపుణ్యానికి ఖర్చు చేయడమెందుకన్నట్లు మాట్లాడుతున్నారు. టికెట్ ఖరారైతే గెలుపు కోసం భారీగా ఖర్చుచేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించడంతో అధికార బీఆర్‌ఎస్‌లో జోష్ కనిపిస్తోంది.

'జమిలి' ఎన్నికలపై చర్చ

దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల చర్చ కొనసాగుతోంది. లెక్కప్రకారం ఐదేళ్లకే ఎన్నికలు నిర్వహిస్తారా.. లేదంటే జమిలి పేరిట మరో మూడునాలుగు నెలలు ముందుకు తీసుకెళ్తారా.. అన్న చర్చ జిల్లాలోనూ నడుస్తోంది. అటు మోదీ సర్కారు తీరు, ఇటు తాజా మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆశావహులు, పార్టీ నేతలూ చర్చించుకుంటున్నారు. ఒకవేళ ఎన్నికలు మరింత ముందుకు వెళ్తే ఈ ఆరేడు నెలల కాలం ఏం చేయాలనే మీమాంసలో పడ్డారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అధికారులు, విద్యార్థులు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో బుధవారం ఓటు నమోదుపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, సర్పంచ్ జంగం వీరేశ్‌కుమార్, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో మోహన్, ఏపీవో దివ్యారెడ్డి, నాయకులు రవి, రాజేశ్వర్, నవీన్, అనిల్, కేజీబీవీ ఎస్వో అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలి

రక్తహీనతపై జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. 'ఎనీమియా సే ముక్త్ నిర్మల్' కార్యక్రమంలో భాగంగా దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, నిఖిలారాణి, డాక్టర్ శ్యాంకుమార్, సూపర్‌వైజర్లు రాజేశ్వర్, దుర్గాభవాని, మాధురి, కమల, ఏఎన్‌ఎంలు సునీత, శోభ, ఆశ కార్యకర్తలున్నారు.

16న తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలి

నిర్మల్ రూరల్: ఈనెల 16వ తేదీన పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఓ ప్రకటనలో సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేలా చూడాలని, ఇందుకు తగిన సూచనలు, సలహాలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతుల గురించి తెలిపి తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు. విద్యార్థుల నిర్మాణాత్మక మూల్యాంకనం–1 ప్రగతి వివరాలపై చర్చించాలన్నారు. 'ఇంటింటా చదువుల పంట' యాప్ తల్లిదండ్రుల మొబైళ్లలో వేసి ఉపయోగించేలా చూడాలని, ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని సూచించారు.

'రేషన్'కు ఈ-కేవైసీ

- లబ్ధిదారుల వేలిముద్రలు తప్పనిసరి
- లేకుంటే కార్డులోంచి పేరు తొలగింపు
- నిలిచిపోనున్న వారి రేషన్ కోటా..
- రేషన్‌డీలర్ల ద్వారానే ప్రక్రియ అమలు

జిల్లాకు సంబంధించిన వివరాలు

చౌకధరల దుకాణాలు	412
అంత్యోదయ కార్డులు	12,487
ఆహారభద్రత కార్డులు	1,96,223
అన్నపూర్ణ కార్డులు	33
మొత్తం కార్డులు	2,08,743
మొత్తం యూనిట్లు	6,44,249

నిర్మల్‌చైన్‌గేట్: నిరుపేదల ఆకలి తీర్చేందుకు చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్‌కోటా దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రేషన్‌కార్డులోని సభ్యులందరి పేర్లు ధ్రువీకరించుకునేందుకు నిర్ణయించింది. లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి ఈ–కేవైసీ పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. కార్డులో పేరున్న కుటుంబంలోని ప్రతిఒక్కరూ తమ పరిధిలోని రేషన్‌షాపులకు వెళ్లి ఈ–పాస్ యంత్రంలో వేలిముద్రలు వేసి ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని సూచించింది. రేషన్ దుకాణాల్లో మాత్రమే వేలిముద్రలు సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. డీలర్లు తమ దుకాణాల పరిధిలోని కార్డుదారులకు సమాచారం అందించి ఒకేసారి కుటుంబ సభ్యులంతా వచ్చి వేలిముద్రలు వేసుకుని ఈకేవైసీ పునరుద్ధరించుకునేలా చూడాలని తెలిపింది.

రేషన్ దుకాణాల వారీగా..

జిల్లాలో కార్డులు, యూనిట్ల ఏరివేతను రేషన్ డీలర్ పరిధిలోనే చేపట్టనున్నారు. రేషన్ డీలర్లు డీ డూప్లికేట్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ నొ యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) చేపట్టనున్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యం తీసుకోవాలంటే వేలిముద్ర వేస్తున్నట్లే అదే విధానంలో రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేయాలి. కార్డులో ఎంతమంది ఉంటే అంతమంది వేలిముద్ర వేయాల్సిందే. ఒకవేళ వేలిముద్ర పడకుంటే ఐరిస్ ద్వారా నిర్ధారించనున్నారు. సదరు ప్రక్రియలో పాల్గొనకుంటే కార్డు రద్దు చేయనున్నారు.

ప్రభుత్వానికి నివేదిక..

జిల్లావ్యాప్తంగా ఆయా కేటగిరీల వారీగా 2,08,743 రేషన్ కార్డులున్నాయి. వీటిలో 6,44,249 మంది సభ్యులు (యూనిట్లు) ఉన్నారు. ప్రతినెలా దాదాపు 4,700 మెట్రిక్ టన్నుల బియ్యం ఆయా రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రేషన్‌కార్డుల పునరుద్ధరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ ఇప్పటివరకు చేపట్టలేదు. కుటుంబంలో యజమాని లేదా సభ్యులు మరణించినా, ఆడపిల్లలకు వివాహాలు జరిగి వెళ్లిపోయినా, మగపిల్లలు పెద్దవారై వివాహాలు చేసుకుని ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నా వారి పేర్లు తొలంగించలేదు. కుటుంబ సభ్యుల్లో కొందరు లేకున్నా ఏళ్ల తరబడి వారి పేరిట నెలకు ఆరు కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే ఇప్పటివరకు కొత్త కార్డులు జారీ చేయకపోవడం, పెళ్లి చేసుకుని వచ్చిన ఆడపిల్లల పేర్లు నమోదు చేయకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డీలర్లకు తలనొప్పే..

రేషన్ కార్డుకు ఈ–కేవైసీ అనుసంధానం రేషన్ డీలర్లకు తలనొప్పిగా మారనుంది. రేషన్ కార్డులో ఉన్న ప్రతీ ఒక్కరి వేలిముద్ర సేకరించాలంటే ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఒక్కో షాపు పరిధిలో 300 నుంచి 500 వరకు రేషన్‌కార్డులున్నాయి. అయితే ఒక్కో కార్డులో ఒకరి నుంచి ఎనిమిది మంది వరకు కూడా ఉన్నారు. వీరందరి వేలిముద్రలు సేకరించాలంటే డీలర్లపై అదనపు భారం పడనుంది.



కార్డులో పేరుంటే తప్పనిసరి

పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. రేషన్ లబ్ధిదారులు చౌకధరల దుకాణాల్లోనే ఈ–కేవైసీ చేయించుకోవాలి. కార్డుదారుల వివరాలు నవీకరించేందుకు చివరి తేదీ అంటూ ఏమీ రాలేదు. చౌకబియ్యం సరఫరా నిలిచిపోకుండా ఉండాలంటే కార్డుల్లో పేర్లున్నవారంతా ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలి. – **ఎస్‌ఎం అలీ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి**

ఈ-కేవైసీ నమోదు ఇలా..

రేషన్‌కార్డు కలిగిన కుటుంబ యజమానితో పాటు కార్డులో ఉన్న కుటుంబ సభ్యులంతా సమీప చౌకధరల దుకాణానికి వెళ్లి ఈ–పాస్ యంత్రంలో వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయగానే రేషన్‌కార్డు నంబర్‌తోపాటు సభ్యుల ఆధార్ నంబర్ చూపిస్తుంది. వీటిని సరిచూసిన తర్వాత ఆకుపచ్చ రంగు వెలిగి సదరు సభ్యుల కేవైసీ పునరుద్ధరణ జరుగుతుంది. ఒకవేళ ఈ–పాస్ యంత్రంలో ఎరుపు రంగు వెలిగితే సదరు వినియోగదారు రేషన్‌కార్డు, ఆధార్ సరిపోల్చలేమంటూ రిజక్ట్ సూచిస్తుంది. దీంతో ఒక యూనిట్ రేషన్‌కార్డు నుంచి తొలగింపునకు గురవుతుంది. రేషన్‌కార్డులో ఎంతమంది పేర్లుంటాయో వారంతా చౌకధరల దుకాణానికి ఈ–కేవైసీ కోసం ఒకేసారి వెళ్లాల్సి ఉంటుంది. ఒకవేళ ఒకరిద్దరు గైర్హాజరైతే వారు కుటుంబం నుంచి దూరమయ్యారని గుర్తిస్తూ అందుబాటులో ఉన్న వ్యక్తుల ఈ–కేవైసీని పరిశీలిస్తారు. ఈ ప్రక్రియలో గైర్హాజరైన యూనిట్ల వివరాలు ఈ–పాస్ యంత్రంలో నమోదై ఉంటాయి. తర్వాత ఈ యూనిట్లను తొలగిస్తారు.

'విమోచనాన్ని ఘనంగా నిర్వహించాలి'



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ గతేడాది నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని, ఈసారి కేంద్రమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తారని తెలిపారు. పోరాట యోధులకు నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి అసువులు బాసిన రాంజీగోండు, కొమురంభీం చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చకుండా ఎంఐఎం మెప్పుకోసం సీఎం కేసీఆర్ పాకులాడుతున్నారని ఆరోపించారు. సెప్టెంబర్ 17న నిర్మల్‌లో మహేశ్వర్‌రెడ్డి నాయకత్వంలో వెయ్యి ఉరుల మర్రి వద్ద నివాళులర్పించి, జాతీయ జెండా ఎగురవేసి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడి చరిత్రను కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకువస్తే విమోచన ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు ముత్యంరెడ్డి, సాదం అరవింద్, అల్లం భాస్కర్, రామోజీ నరేశ్, ప్రజోత్‌రావ్, కూన శివకుమార్, జమాల్ పాల్గొన్నారు.

జీవనభృతి కోసం బీడీ కార్మికుల ధర్నా



భైంసా: ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

భైంసాటౌన్: ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవనభృతి అందించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు బుధవారం భైంసా ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల బీడీ కార్మికులు ముందుగా ఆర్‌అండ్‌బీ ఆవరణలో సమావేశమై ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కటాఫ్ తేదీ ఎత్తివేయాలని, బీడీ పరిశ్రమలో పనిచేసే అన్ని కేటగిరీల కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని, కనీస వేతనాల చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే రాజన్న, జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, నాయకులు గఫూర్, కట్ట లక్ష్మి, ఎస్.లక్ష్మి తదితరులున్నారు.

కలెక్టరేట్ ఎదుట..

నిర్మల్‌చైన్‌గేట్: షరతులు లేకుండా జీవన భృతి అందించాలని ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సయ్యద్ మహమూద్ మాట్లాడారు. పదేళ్లుగా జిల్లాలో కొద్దిమందికే జీవనభృతి అందుతోందని, అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేశారు.

నవరాత్రోత్సవాల ఏర్పాట్లపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి సంఘం నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ సమావేశమయ్యారు. గణేశ్ నవరాత్రోత్సవాలు, నిమజ్జనోత్సవం ఏర్పాట్లపై సమీక్షించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. సమన్వయంతో నవరాత్రోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఆర్డీవో రత్నకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పరిశీలన



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న శంకరయ్య

కుభీర్: మండల కేంద్రంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లలో నాణ్యత లోపించిందని కుభీర్‌కు చెందిన హ్యూమన్ రైట్స్ కమిషన్ మండలాధ్యక్షుడు సాప పండరి, పలువురు గ్రామస్తులు కలెక్టర్ వరుణ్‌రెడికి ఫిర్యాదు చేయగా బుధవారం పీఆర్ ఈఈ శంకరయ్య, డీఈ సురేశ్ రోడ్లు పరిశీలించారు. వైశ్యకాలనీ, శివాలయం వద్ద, కిసాన్‌గల్లీలో వేసిన రోడ్లు పరిశీలించి స్థానికుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈఈ మాట్లాడుతూ.. క్వాలిటీ కంట్రోల్‌వారితో నాణ్యత పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వారి వెంట ఫిర్యాదుదారు పండరి, నాయకులు ఏశాల దత్తాత్రి, సంతోష్, నాగలింగం, రహూఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సునీల్ తదితరులున్నారు.

15న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాక



నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించనున్న సోనియా గాంధీ విజయభేరి సభకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని ఈ నెల 15న ఉదయం 11 గంటలకు నిర్మల్ పట్టణంలోని రాజరాజేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన 'ఉన్నతి' శిక్షణ



మాట్లాడుతున్న నర్సయ్య

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఉన్నతి శిక్షణ బుధవారం ముగిసింది. జిల్లాలో పనిచేస్తున్న సోషల్ స్టడీస్, సైన్స్, హిందీ ఉపాధ్యాయులకు వేర్వేరుగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్వో నర్సయ్య మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను విద్యార్థులకు బోధించాలని సూచించారు. రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ అందజేసిన పుస్తకాలను వినియోగించుకోవాలని, వెనుకబడిన ఉపాధ్యాయులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

16న జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ లోగల బాలికల హైస్కూల్‌లో ఈనెల 16వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతులకు చెందిన ఇద్దరు చొప్పున విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. 'చిరుధాన్యాలు ఉత్తమ ఆహారమా? లేక ఆహార వ్యామోహమా?' అనే అంశంపై ఆరు నిమిషాల పాటు పోస్టర్ల సహాయంతో వివరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. హాజరయ్యేవారు సంబంధిత గైడ్ టీచర్ సాయంతో 9440069830, 9440786515 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 16వ తేదీ లోపు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మండలంలో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యురాలు


మాట్లాడుతున్న ఈశ్వరిబాయి

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండలంలోని రాజుగూడ, సోనాపూర్, కుమ్మరికుంట, రాంజీగోండ్‌నగర్ గ్రామాల్లో బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి వసతి, రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీరోడ్లు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఐటీడీఏ పీవోతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయాలపాలైన అజీమ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం, తుఫాన్ వాహనం ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ నుంచి పలువురు ప్రయాణికులు తుఫాన్ వాహనంలో హుస్నాబాద్‌కు వెళ్తుండగా లక్సెట్టిపేట నుంచి ఉట్నూర్ వైపు వస్తున్న ద్విచక్ర వాహనం దంతన్‌పల్లి సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న షేక్ అజీమ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు క్షతగాత్రుని ప్రైవేటు వాహనంలో ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై సామగ్రి దగ్ధం


ఇంట్లో వ్యాపిస్తున్న మంటలు

నస్పూర్: పట్టణ పరిధిలోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపించడంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం హనుమాన్‌నగర్‌కు చెందిన కంబాల శంకర్ భార్య తిరుమల బుధవారం వంటగ్యాస్ సిలిండర్‌కు రెగ్యులేటర్ మారుస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఘటనలో ఇంటి పైకప్పు రేకులు, రిఫ్రిజిరేటర్, టీవీ, బీరువా, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల చొప్పున నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిదం మహేశ్, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సురిమిల్ల వేణు, బొౌతు వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో కాడెద్దుల పండుగ

- నేడు పొలాల అమావాస్య
- ఎడ్ల పండుగగా ప్రతీక
- ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామ పటేళ్లు


అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న రైతులు


ఎద్దులకు పూజలు చేస్తున్న రైతు కుటుంబం (ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): శ్రావణమాసంలో వచ్చే చివరి పండుగ పొలాల అమావాస్య. ఈ పండుగను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. పండుగలన్నీ మానవజాతికి చెందినవే. కానీ పొలాల అమావాస్య మాత్రం ఎద్దులకు చెందిన ప్రత్యేక పండుగ. ఈ పండుగకోసం గిరిజన గ్రామాల్లోని గూడేలు, పల్లెల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా రైతులు బుధవారం తమ ఎడ్లను శుభ్రంగా కడిగి ఇళ్లకు తీసుకొచ్చారు. కొమ్ములకు రకరకాల రంగులు, వీపుపై జూలు, మెడలో గంటలతో పాటు రంగుల బొమ్మలు వేసి అందంగా అలంకరిస్తారు. అలంకరించిన ఎద్దులతో గురువారం సాయంత్రం ఆంజనేయస్వామి ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణ చేయిస్తారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామ పటేల్ తోరణం తెంపిన తర్వాత ఎద్దులను గ్రామాల్లోకి అనుమతిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నేడు పొలాల అమావాస్య జరుపుకోనున్నారు.

ఎడ్లకు నైవేద్యంగా...

దేవాలయాల్లో ప్రదక్షిణ అనంతరం ఇళ్లకు తీసుకువచ్చిన ఎడ్లకు పూజలు చేసి ఆ రోజు చేసిన వంటకాల్ని నైవేద్యంగా తినిపిస్తారు. ఎడ్లు తిన్న నైవేద్యాన్ని కుటుంబ సభ్యులు ఆరగిస్తారు. ఇది


బసవన్నల వీపుపై వేసే జూలు

పురాతన కాలం నుంచి వస్తున్న ఆచారంగా పెద్దలు చెబుతున్నారు. ఎడ్లులేని రైతులు కూడా తమతమ బంధువుల ఎడ్ల జతలను తీసుకవచ్చి పూజలు నిర్వహిస్తారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకుంటారు.

శుక్రవారం బడిగా..

పొలాల అమావాస్య మరుసటిరోజు బడిగా పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. శ్రావణమాసంలో నెల రోజులపాటు మాంసాహారం భుజించకుండా నియమనిష్టలతో పాటిస్తారు. అనంతరం బడిగా పండుగరోజు మాంసాహారం స్వీకరిస్తారు. 'ఈగలు, దోమలు, రోగాలు, తీసుకుపోరా బడిగా' అంటూ ఇళ్ల నుంచి కేకలు వేస్తూ రాత్రి చేసిన పిండివంటల నైవేద్యాన్ని తీసుకుని గ్రామ పొలిమేర వరకు వెళ్తారు. అక్కడ జమ్మిచెట్టుకు పూజలు జరిపి కలిసికట్టుగా నైవేద్యం ఆరగిస్తారు. ఆ రోజు నుంచి ఈగలు, దోమలు, వ్యాధులు పారిపోతాయని గ్రామీణ ప్రాంత ప్రజల నమ్మకం.

ఉత్సాహంగా జరుపుకుంటాం



ఏడాదికోసారి వచ్చే పొలాల పండగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటాం. ఎడ్ల పండుగకు ప్రతీతి పొలాల అమావాస్య. ఎడ్లకు చెందిన పండుగగా భావించి రైతులందరు తమ ఎడ్లను అందంగా అలంకరిస్తారు. సాయంత్రం అంజనేయస్వామి ఆలయం చుట్టూ ఎద్దులతో ఐదు ప్రదక్షణలు చేయిస్తాం. ఇది పురాతన కాలం నుంచీ వస్తున్న ఆచారం.

– మడావి రఘునాథ్, ఆదివాసీ నాయకుడు, మెట్టపిప్రి

టీ తాగేందుకు వెళ్లి.. హత్యకు గురై..

- ఇస్నాపూర్ శివారులో యువకుడిని హతమార్చిన గుర్తుతెలియని వ్యక్తులు


నదీం తాహెర్(ఫైల్)

భైంసాటౌన్/పటాన్‌చెరుటౌన్: టీ తాగేందుకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన అబ్దుల్ నదీమ్ తాహెర్(28) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. అతడికి 10 నెలల క్రితం వివాహమైంది. ఈ నెల 12న మంగళవారం హైదరాబాద్ టోలిచౌకిలో ఉండే సోదరి ఇంటికి సోదరుడు అబ్దుల్ అజీమ్‌తో కలిసి అబ్దుల్ నదీమ్ తాహెర్ వచ్చాడు. అదేరోజు సాయంత్రం స్నేహితుడితో కలిసి టీ తాగేందుకు బయటకు వెళ్తున్నానని బైక్‌పై వెళ్లాడు. రాత్రి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా సంగారెడ్డి జంజం దాబాలో భోజనం చేస్తున్నానని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ కాల్ చేయగా ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. అనంతరం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ శివారు జాతీయ రహదారి పక్కన ఎవరో గుర్తుతెలియని దుండగులు నదీమ్‌ను గొంతుకోసి హత్య చేశారని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతుడు రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఆ నేపథ్యంలో హత్య జరిగిందా..? లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు వివిధ కోణాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో పటాన్‌చెరు సీఐ లాలూనాయక్, క్లూస్ టీం వివరాలు సేకరించారు. పోస్టుమార్టం అనంతరం బుధవారం భైంసాలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి భార్య ఎనిమిది నెలల గర్భిణి అని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


గంగయ్య (ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీకి చెందిన మెంగు గంగయ్య (55) దుబాయిలో గత నెల 30న అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం మృతదేహం స్వగ్రామం చేరుకుంది. మృతునికి భార్య లావణ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. 30 ఏళ్లుగా గల్ఫ్‌లోనే ఉంటున్న గంగయ్య మరో రెండేళ్లలో స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో శేషజీవితం సంతోషంగా గడుపుతామనుకున్నాడు. విధి వక్రీకరించి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు అందరినీ కలచివేశాయి.

పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య

బోథ్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కరత్వాడ గ్రామానికి చెందిన దేశం మహేష్ (26) కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఈ నెల 11న పంటచేనులో మోనోసిల్ అనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా బోథ్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తండ్రి గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

బోథ్: మండలంలోని పార్డి బి గ్రామానికి చెందిన జుగ్నక్ విజయ్ కుమార్ ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన విజయ్ కుమార్‌ను గత ఫిబ్రవరిలో కుక్క కరిచింది. విషయం ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. ఇటీవల ఇన్‌ఫెక్షన్ కావడంతో బుధవారం బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా వైద్యుల సూచన మేరకు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని సోదరుడు జుగ్నక్ సోనేరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


బియ్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామ సమీపంలో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారంతో దిందా గ్రామం వద్ద తనిఖీలు నిర్వహించగా రెండు ఆటోలలో ఖర్జెల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరికి తరలిస్తున్న డోకె మల్లేశ్‌కు చెందిన మూడు క్వింటాళ్లు, చౌదరి రవికి చెందిన మూడు క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఆటోలను స్వాధీనం చేసుకుని చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీలలో ఎస్సై సందీప్‌కుమార్, సిబ్బంది రమేష్, మధు, సంజీవ్ పాల్గొన్నారు.

దొంగ ఓట్ల నమోదుపై ఫిర్యాదు


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఓటరు జాబితాలో నమోదైన దొంగఓట్ల నమోదుపై మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఢిల్లీ లోని చీఫ్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ జాతీయ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అప్రజాస్వామికంగా బోగస్ ఓట్లను నమోదు చేయించి వాటితోనే ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్నారన్నారు. కేవలం నిర్మల్ పట్టణంలోనే 32వేలకు పైగా దొంగ ఓట్లు నమోదయ్యాయని, దీని వెనుక మంత్రి హస్తం ఉందన్నారు. మంత్రి కి నియోజకవర్గంలో తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో తిరిగి ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోలేక మంత్రి ఇలా దొంగ ఓట్లను నమోదు చేయించడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కి తగిన గుణపాఠం చెబుతారన్నారు. దొంగ ఓట్ల జాబితా నమోదుపై కమిషన్ వేయాలని, ఇందుకు కారకులైన అధికారులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల అధికారికి తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఏడెల్లి అజయ్ కుమార్, కేతినేని సరళ, కొల్లూరు పవన్ కుమార్, భరద్వాజ్ పాల్గొన్నారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న దుర్గం భాస్కర్

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట సమీపంలో గుడిసెలు కాలబెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సంపత్, రాజేశ్, కృష్ణమూర్తి, భాస్కర్, విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్, అనపర్తి యువరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు బొడెంకి చందు ఉన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


ఆర్థికసాయం అందిస్తున్న ఎస్పీ

జైనూర్: గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని కాశీపటేల్‌గూడకు చెందిన కుడ్మేత జలపత్ (55) ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో హెడ్ కాని స్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బుధవారం ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల నగదు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఐలు రమేశ్, రాణా ప్రతాప్, మల్లేశ్, సురేష్, ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇచ్చోడ(బోథ్): నియోజకవర్గ వ్యాప్తంగా ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని ఐటీడీఏ పీవో, బోథ్ అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ఇచ్చోడ తహసీల్దార్, బోథ్ అసెంబ్లీ ఎన్నికల ఏఆర్‌వో తుకారాంను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదులు, వంటగదిని పరిశీలించారు. అర్హులైన ప్రతిఒక్కరు ఫారం-6 ద్వారా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా బయటకు వచ్చిన గొర్రెల కాపరులు


గొర్రెల కాపరులతో ఎస్సై, సర్పంచ్

లక్ష్మణచాంద: గొర్రెలను మేతకోసం గోదావరి మధ్యలో గల కుర్రులోకి తీసుకెళ్లిన ఇద్దరు కాపరులు అక్కడే చిక్కుకున్న సంఘటన మండలంలోని పార్‌పెల్లిలో చోటు చేసుకుంది. పార్‌పెల్లి గ్రామానికి చెందిన కందుకూరు ముత్తన్న, పార్‌పెల్లి తండాకు చెందిన గుగ్లోత్ లాలు మంగళవారం ఉదయం తమ గొర్రెలను మేతకోసం గోదావరి మధ్యలో గల కుర్రులోకి తీసుకెళ్లారు. సాయంత్రం నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో అక్కడే చిక్కుకున్నారు. బుధవారం ఉదయం సర్పంచ్ రాజేందర్ ద్వారా ఎస్సై శ్రీకాంత్‌కు సమాచారం అందించారు. నీటి ప్రవాహం తగ్గడంతో గ్రామానికి చెందిన జుంగాల శ్రీనివాస్, సుంకరి గంగాధర్, కందుకూరి నాగేష్ గోదావరి అవతలికి వెళ్లి గొర్రెల కాపరులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. నీటి ప్రవాహం ఇంకా ఉండడంతో ఇరువురికి చెందిన 150 నుంచి 200 గొర్రెలను మాత్రం అక్కడే ఉంచినట్లు తెలిపారు. సదరు యువకులను ఎస్సై శ్రీకాంత్, సర్పంచ్ రాజేందర్, గ్రామస్తులు అభినందించారు.

సత్తన్న అనుచరుల సమావేశం

నిర్మల్: బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి వల్లకొండ సత్యనారాయణగౌడ్ అనుచరుల సమావేశం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం సమావేశమయ్యారు. సత్యనారాయణగౌడ్ ప్రస్తుతం అమెరికాలో ఉండగా ఆయన అనుచరులు ఇక్కడ సమావేశం కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. కొంతకాలంగా పార్టీకి దూరంగా ఉంటూ వచ్చి ఆయన సీఎం పర్యటన సమయంలోనే మళ్లీ కొంత దగ్గరయ్యారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు ఒకదశలో సత్యనారాయణగౌడ్ పార్టీ మారుతారన్న ప్రచారమూ జరిగింది. కానీ తిరిగి మంత్రితో కలిసి సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అయినప్పటికీ పార్టీలో తమ నేతకు సముచిత స్థానం దక్కడం లేదన్న అసహనం ఆయన వర్గంలో కనిపిస్తోంది. ఈక్రమంలో తమ నేతలేని సమయంలో వారంతా సమావేశం కావడమే చర్చనీయాంశమైంది. గతంలో బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేసిన వడ్డి రాజేందర్‌రెడ్డి, నాయకులు సాధు రామ్‌రెడ్డి, గంగయ్య, మౌలానా, వెంగ్వాపేట్ రమేశ్, తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది. ఈ సమావేశం నేపథ్యంలో అమెరికాలో ఉన్న సత్యనారాయణగౌడ్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవని, తనకు పార్టీ మారే ఆలోచన కూడా లేదన్నారు. తాను వచ్చిన తర్వాత అనుచరవర్గంతో మాట్లాడుతానని చెప్పారు.


అక్రమ నిర్మాణం కూల్చివేత


కూల్చి వేయిస్తున్న అధికారులు

నస్పూర్: ఈ నెల 12న 'సెలవు రోజు–అక్రమ నిర్మాణాల జోరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నస్పూర్ శివారులోని సర్వే నంబర్ 42లో ఇన్‌కం ట్యాక్స్ కార్యాలయానికి కేటాయించిన స్థలంలో అక్రమంగా వెలిసిన షెడ్డును బుధవారం జేసీబీ సాయంతో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ టీం (మున్సిపల్, రెవెన్యూ, పోలీస్) ఆధ్వర్యంలో కూల్చి వేయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ చందర్, మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక్‌కు ఎమ్మెల్యే ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..



ఫోన్‌పే ద్వారా పంపించిన ఆర్థికసాయం

కెరమెరి(ఆసిఫాబాద్): సిక్కిం రాష్ట్రంలోని నామ్‌చా జిల్లాలో ఈ నెల 18 నుంచి కొనసాగనున్న శిక్షణలో పాల్గొందుకు వెళ్తున్న కెరమెరి మండలంలోని కెలి కే గ్రామానికి గిత్తే కార్తీక్‌కు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ నెల 12న 'ఎవరెస్ట్ వైపు తొలి అడుగు' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. ఫోన్‌పే ద్వారా కార్తీక్ ఖాతాలో రూ.10 వేలు జమచేశారు. కార్తీక్‌తో పాటు అతని తల్లిదండ్రులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

పరిహారం చెల్లించాలని మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్

భీమారం(చెన్నూర్): రాష్ట్ర వ్యాప్తంగా పిడుగుపాటుతో మృతి చెందిన గొర్రెలకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌యాదవ్ బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈఏడాది పిడుగుపాటుతో అధికసంఖ్యలో గొర్రెలె మృత్యువాత పడ్డాయని, పశువుల కాపరులు కూడా మృతి చెందారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆ విద్యార్థి తల్లిదండ్రులు తనకు నచ్చకుండా సర్టిఫికెట్లు ఇచ్చి ఆ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. దీంతో ఆ విద్యార్థి ఆ కళాశాలలో చదువనని, తన సర్టిఫికెట్లు ఇవ్వాలని రెండు నెలలుగా కళాశాల చుట్టూ తిరుగుతున్నాడు. రూ.5 వేలు కడితే సర్టిఫికెట్లు ఇస్తామని, ఎప్పుడు వెళ్లినా ప్రిన్సిపాల్ అందుబాటులో లేడని సిబ్బంది చెప్తుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం కళాశాల భవనం పైనుంచి కిందకు దూకేందుకు యత్నించగా తోటి విద్యార్థులు అడ్డుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పారిగాంలో పేకాట ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై డీకొండ రమేశ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం గ్రామంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న వారి వద్ద రూ.16,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేషన్ షాపులో చోరీ

కోటపల్లి: మండలంలోని కొండంపేట రేషన్ షాపులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. రేషన్ డీలర్ నీల మనోహర్ బుధవారం ఉదయం సరుకులు పంపిణీ చేసేందుకు దుకాణానికి వెళ్లి చూడగా పైకప్పు తొలగించి, తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బియ్యం ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్‌ఐ విజయ, ఏఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. 7 క్వింటాళ్ల బియ్యం దొంగిలించారని, సుమారు రూ.25వేల వరకు నష్టం జరిగినట్లు తెలిపారు.

క్లుప్తంగా

పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలి

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని ఎంపీవో సనీరుద్దిన్ పంచాయతీ అధికారులకు సూచించారు. బుధవారం మండలంలోని కనకాపూర్ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మురుగు నిల్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శికి సూచించారు.

నూతన కార్యవర్గం

ఖానాపూర్: పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో బుధవారం ఖానాపూర్ హిందూ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు అంకం రాజేందర్, వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేశ్, ప్రధాన కార్యదర్శిగా శ్యామ్, కోశాధికారిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజు, రమేశ్, మహేశ్, రాజశేఖర్, రాజేందర్, గౌరవ ముఖ్య సలహాదారులుగా రాజేశ్వర్, రాజశేఖర్, గంగాధర్, లక్ష్మీనారాయణ, ఆనంద్, రాజగంగన్న, రాజేశ్వర్, సత్యం, జితెందర్, సంతోశ్, రాజెందర్, నాగేందర్, సంయుక్త కార్యదర్శులుగా లక్ష్మణ్, సురేశ్, ప్రచార కార్యదర్శులుగా కృష్ణస్వామి, ప్రవీణ్, కార్యవర్గ సభ్యులు, తదితరులను ఎన్నుకున్నారు.

సమీకృత సాగును ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న డీఆర్డీవో

కుంటాల: వ్యవసాయంలో రైతులను సమీకృత సాగుకు ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ, ఐకేపీ, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పండ్లతోటలు, కోళ్ళ, చేపల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతుల వివరాలను సేకరించాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో ఇచ్చే పనిముట్లు, రాయితీలను రైతుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం అశోక్, సీసీ గంగాప్రసాద్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ముధోల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ ప్రతినిధులు ఎస్ఎన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం నిర్మల్‌లో ఈ నెల 11 నుంచి 16 వరకు నిర్వహించనున్న వారోత్సవాల కరపత్రాలను బుధవారం మండల కేంద్రం ముధోల్‌లో ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ ప్రతినిధులు కొండిబా, ఎల్ఆర్ ఉపాలి, గౌతమ్ ఉన్నారు.

విద్యార్థికి సన్మానం


దుర్గాదాస్‌ను సన్మానిస్తున్న స్థానికులు

కుభీర్: మండలంలోని రంజనితండాకు చెందిన రాథోడ్ దుర్గాదాస్ అనే విద్యార్థి మెడిసిన్ ర్యాంక్ సాధించి కామినేని కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించడంతో తండావాసులు బుధవారం స్థానిక జగదంబా మందిరంలో పూలమాలలతో సన్మానించారు. తల్లిదండ్రులైన శోభ సుదామ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగారావ్, ఏపీవో హరిలాల్, నాయకులు సాహెబ్రావ్, గులాబ్, గోకుల్ ఉన్నారు.

విద్యార్థులకు సామగ్రి

కుంటాల: మండలంలోని దౌనెల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గంగాధర్, భైంసా మండలంలోని తిమ్మాపూర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వినాయకరెడ్డి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. సొంత గ్రామమైన లింబా(కె) ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం రూ.10వేల విలువ విద్యాసామగ్రి అందజేశారు. సర్పంచ్ ఆనందరావు పటేల్, మాజీ ఆత్మ చైర్మన్ సవ్వి అశోక రెడ్డి, హెచ్ఎంలు సతీష్ కుమార్ ఉన్నారు.

గులాబీలతో న్యాప్కిన్ తయారీ


తయారీ విధానాన్ని వివరిస్తున్న డీఆర్డీవో

కుంటాల: కుంటాలలోని రేలా బయోడిగ్రేడబుల్ కేంద్రంలో న్యాప్కిన్ తయారీలో గులాబీ రేకులను వాడడం అభినందనీయమని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. గులాబీల వినియోగంపై హైదరాబాద్‌లోని అప్పాగ్రీన్ సహకారంతో వీడియో ద్వారా పలు అంశాలను చిత్రీకరించారు. మహిళలు తయారు చేసిన న్యాప్కిన్ విధానాన్ని మార్కెటింగ్ కోసం చిత్రీకరించామని డీఆర్డీవో వెల్లడించారు. ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీఎం అశోక్, ఏపీవో గట్టుపల్లి నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు,రేలా మేనేజర్ శివప్రసాద్, సీసీలు పెంటన్న, యూసుఫ్, కవిత పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో..

- ఓటరు నమోదుపై అవగాహన
- గ్రామాల్లో విద్యార్థుల ర్యాలీలు


కుంటాల: విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు


తానూరు: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కుంటాల: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో చునావ్ (ఎన్నికలు) నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొని మాట్లాడారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కల్లూర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్‌లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్ జానకిరామ్ కోరారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మసార్ రావు, ఎంఈవో ముత్యం, సర్పంచ్ దౌనికెన సమతావెంకటేష్, హెచ్ఎం సక్రపు గజేందర్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు పాల్గొన్నారు.

రాజూరా గ్రామంలో..

ఖానాపూర్: ఓటరు నమోదుపై అవగాహన కల్గి ఉండాలని తహసీల్దార్ పరిమల్ బౌమిక్ అన్నారు. మండలంలోని రాజూరా గ్రామంలో సర్పంచ్ చిన్నం లావణ్య ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంతకముందు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వైస్ చైర్మన్ ఖలీల్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్ కావలి సంతోశ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో మల్లేశ్, సిబ్బంది లింగన్న, షాకిర్, శ్రీను, రాణి, అశోక్ పాల్గొన్నారు.

కొండుకూర్ గ్రామంలో...

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో ఓటు హక్కుపై సర్పంచ్ వేణుగోపాల్, బీఎల్‌వో గంగామణి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఓటరు కార్డులో తప్పులు సవరించుకోవాలని, 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ర్యాలీ నిర్వహించారు.

ఓటు హక్కు విలువైనది

తానూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని తహసీల్దార్ లింగం మూర్తి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 19వ తేదీలోగా సంబంధిత గ్రామాల బీఎల్‌వోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సర్పంచ్ విఠల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోస్లే సుభాష్, మాజీ సర్పంచ్‌లు మాధవ్ రావ్ పటేల్, రాములు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల, పాఠశాల విద్యార్థులతో ఓటు హక్కు నమోదుపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ అథిక్, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎస్సై హోమన్‌రావు, ఆర్ఐ నారాయణ ఉన్నారు.

సోన్‌లో...

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం గ్రామంలో విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీలో నిర్వహించగా మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈఓ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస మూర్తి, గ్రామ సర్పంచ్ అంకం, గంగామణి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో...

లక్ష్మణచాంద: చునావ్ విద్యార్థి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ శ్రీలత పాల్గొని మాట్లాడారు. ఇందులో సర్పంచ్ ముత్యం రెడ్డి, ఎంపీడీవో శేఖర్ మండల సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్ ,ఐసీడీఎస్ సూపర్వైజర్ భాగ్యవతి,ఎంపీవో నసీరుద్దిన్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, కళాశాల ప్రిన్సిపాల్ భోజన్న ఉన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: మండల కేంద్రంతో పాటు పల్సి, నిగ్వా తదితర గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎంపీడీవో లింబాంద్రి, ప్రధానోపాధ్యాయులు సాయన్న, ప్రిన్సిపాల్ సునీల్, పల్సి ప్రధానోపాధ్యాయులు దొంతుల సురేష్ ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండల ప్రత్యేకాధికారి నరసింహరెడ్డి, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, సర్పంచ్ వెంకట్‌రావు, ఎంపీటీసీ జీవన్ ఉన్నారు.


లోకేశ్వరం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు


కుభీర్: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


కడెం: కొండుకూర్ గ్రామంలో..


సోన్: న్యూవెల్మల్‌బొప్పారంలో..


ఖానాపూర్: రాజూరా గ్రామంలో..


లక్ష్మణచాంద: ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్

మండల అభివృద్ధికి కృషి


కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

లోకేశ్వరం: మండల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 73మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. అర్లి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. త్వరలో టెండరు కాగానే వంతెన నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు వివరించారు. పిప్రి ఎత్తిపోతల పథకానికి అదనపు పైపులైన్ నిర్మాణం కోసం రూ.20కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. పెండింగ్‌లోని కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చెర్మన్ లోలం శ్యాంసుందర్, తహసీల్దార్ మోతీరాం, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, పీఏసీఎస్ చెర్మన్ రత్నాకర్‌రావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూజంగ్‌రావు, వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి ఉన్నారు.

2న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ

కుంటాల: ముదిరాజ్‌లకు జరుగుతున్న అన్యాయాలపై నిర్మల్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 2న నిర్వహించే ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఈ సంఘం సభ్యులు కోరారు. బుధవారం కుంటాల మండలం కల్లూర్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ డి జాబితా నుంచి ఏ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కిష్టయ్య, ఉమామహేశ్వర్, శంకర్, ప్రశాంత్ కుమార్, రాజన్న, వంశీ రాములు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: కడెం మండలంలోని పాత మద్దిపడగ గ్రామానికి చెందిన పలువురు యువకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పట్టణంలోని జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పార్టీలో చేరగా వారికి బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అంగన్‌వాడీల సమస్యలు తీర్చాలి

లక్ష్మణచాంద: అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మండల అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అంగన్‌వాడీలను బెదిరించడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజమణి, ప్రధాన కార్యదర్శి లలిత, ఉన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకు రమాదేవి మద్దతు

ముధోల్: అంగన్‌వాడీల సమ్మెకు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి మద్దతునిచ్చారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


లక్ష్మణచాందలో మాట్లాడుతున్న సురేష్

సోన్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె బుధవారం కొనసాగింది. సీఐటీయూ నాయకులు సురేష్, లలిత, రాజమణి మద్దతు తెలిపారు. ఇందులో అనురాధ, శకుంతల, రాణి, పద్మకుమారి, రమాదేవి, గంగామణి ఉన్నారు.

మీసేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

పెంబి: మండల కేంద్రలోని మీసేవ నిర్వహిస్తున్న నరేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు మందపల్లి గ్రామానికి చెందిన చెరుపూరి నారాయణ గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం... చెరుపూరి రమేష్ అనే వ్యక్తి గత జూన్ నెలలో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో మరణించాడు. ధృవీకరణ పత్రం కోసం అక్కడ దాఖలైన నంబర్‌ను మరణించిన రమేష్ తమ్ముడి సెల్‌ఫోన్‌కు పంపించారు. మరణ ధృవీకరణ పత్రం కోసం బుధవారం మండల కేంద్రంలోని మీసేవ కేంద్రానికి నారాయణ వెళ్లి ఆన్‌లైన్ నంబర్ ఇచ్చి మరణ ధృవీకరణ పత్రం కావాలని కోరాడు. రూ.700 అవుతాయని మీసేవ కేంద్ర నిర్వాహకుడు తెలిపాడు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం రూ.50 ఉందని అదనంగా 650 ఎందుకని అడగగా నోటరీ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపాడని బాధితుడు వాపోయాడు. గతంలో పెంబి మీసేవ నిర్వాహకుడిపై పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితుడు తెలిపాడు. దీనిపై తహసీల్దార్ లక్ష్మణ్‌ను వివరణ కోరగా.. గతంలో బిజీగా ఉండడంతో ఫిర్యాదు చేసిన పత్రాన్ని కలెక్టర్‌కు పంపలేదని తెలిపాడు. సీపీఐఎం న్యూడెమోక్రసి జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్, మందపల్లి గ్రామస్తులు సత్తన్న, రాజేందర్, దిలీప్, చందు ఉన్నారు.


ఫిర్యాదు చేస్తున్న మందపల్లి గ్రామస్తులు

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన ఎల్కి ప్రగత్ కుమార్ కొద్దిరోజులుగా వెన్నునొప్పితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ప్రభుత్వం సహాయం కోరుతూ ప్రగత్ కుటుంబ సభ్యులు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని సంప్రదించారు. ఆయన బుధవారం రూ.2.5లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసిని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, మంత్రి సోదరుడు అల్లోల సురేందర్‌రెడ్డిలు అందచేశారు.

పింఛన్ ఇప్పించండి సారు..


బీపీఎంను నిలదీస్తున్న వృద్ధురాలి కొడుకు

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన మైస రాజవ్వకు జూన్ నెలలో ఆసరా పింఛన్ మంజూరైంది. పింఛన్ వచ్చిన సమాచారం రాజవ్వకు మూడు నెలలుగా తెలియక పోవడంతో వచ్చిన పింఛన్ రిటర్న్ వెళ్లింది. దీంతో రాజవ్వ కొడుకు రాజ్‌కుమార్ ఇటీవలే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించగా పింఛన్ రిటర్న్ వెళ్లిందని సమాధానమిచ్చాడు. దీంతో బీపీఎం నవీన్‌ను బుధవారం నిలదీశాడు. ఎంఛన్ వచ్చేలా చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశాడు.

పింఛన్ కోసం పాట్లు..!


చంటిబిడ్డలతో వచ్చి దరఖాస్తులు నింపుతున్న మహిళలు

భైంసాటౌన్: అంక్షలు లేని జీవనభృతి అందించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునివ్వడంతో డివిజన్ పరిధిలోని బీడీ కార్మిక మహిళలు భారీగా తరలివచ్చారు. పింఛన్ వస్తుందనే ఆశతో చాలామంది మహిళలు తమ చంటి బిడ్డలతో తరలివచ్చారు. బిడ్డలను ఎత్తుకుని ఇబ్బందులు పడుతూ దరఖాస్తులు నింపుతూ కనిపించారు. పింఛన్ మాటేమోగానీ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన ప్రతిసారి దూర ప్రాంతాల నుంచి మహిళలు ఆశతో వస్తున్నారు.

సోయా పంటల పరిశీలన

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం సోయా పంటను వ్యవసాయ అధికారి రాంచందర్‌నాయక్ పరిశీలించారు. సోయాలో కాండపు ఈగ సోకడంతో పంట నిలువునా ఎండిపోతోందని తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. దీని నివరణకు క్లోరిఫైరిపాస్ 3.5 మిల్లీ లీటర్ల నీటితో పిచికారీ చేయాలన్నారు. ఏఈవో ఆకాష్ ఉన్నారు.

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామంలో బుధవారం వ్యవసాయ విస్తీరణ అధికారి పవన్ రైతుల సోయా, పత్తి పంటలను పరిశీలించారు.

నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్(జి) గ్రామంలో సోయా పంటను బుధవారం ఏఈవో గణేష్ పరిశీలించిన సూచనలు చేశారు.


పంట పరిశీలిస్తున్న ఏవో రాంచందర్ నాయక్

ముధోల్: మండలంలోని వితోలి, వితోలి తండాలోని సోయా పంటను ఏఈవో సిరాజుద్దిన్ పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత ఆర్ట్ టీచరైన రవితేజను బుధవారం సన్మానించారు. ఇటీవలే హైదరాబాద్‌లో జరిగిన 'హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్' లో పాల్గొని జాతీయస్థాయిలో నాలుగో స్థానం సంపాదించినందుకు పాఠశాల యజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నాగభూషణం, ప్రిన్సిపల్ సామ మోహన్ రెడ్డి ఉన్నారు.


రవితేజను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

శాంతిభద్రతలకు సహకరించాలి

భైంసాటౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ ఎల్ శ్రీను అన్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని ఓవైసీనగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 92 ద్విచక్రవాహనాలు, 4ఆటోలు, 2కార్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచిత ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.


మాట్లాడుతున్న సీఐ శ్రీను

బాధిత కుటుంబానికి బాసట

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన వీఆర్ఏ ఆయిండ్ల భూచన్న అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబానికి 2007–09లో ఖానాపూర్ పట్టణంలోని ఇంటర్మీడియట్ చదివిన స్నేహితులు రూ.13వేల నగదును బుధవారం అందజేశారు. ఇందులో లక్ష్మణ్, నాగరాజు, లక్ష్మణ్, రవి, నవీన్, సురేష్, పోషన్న, గంగన్న, సాగర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నచ్చన్‌ఎల్లాపూర్‌ను సందర్శించిన అధికారులు

కడెం: అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్న మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామాన్ని మామడ ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్, ఏపీవో శివాజీ, పంచాయతీ కార్యదర్శులు బుధవారం సందర్శించారు. ఇందులో ఎంపీవో ఉపేందర్, ఉద్యాన, పట్టుపరిశ్ర శాఖ అధికారి మౌనిక, ఏపీవో జయదేవ్, తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలి

కడెం: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులను తరిమికొట్టాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్, నాయకులు గొళ్ల వెంకటేశ్, భూషణం, రఫీక్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

లోకేశ్వరం: విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని బీఆర్‌బీఎస్‌కే వైద్యురాలు ఆయెష జాఫార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీ పాఠశాలలో బీఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనసుయ ఉన్నారు.

వైద్యం అందక గొర్రె మృతి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన జెడ్ల రాజేశ్వర్ గొర్రెల మంద బుధవారం గ్రామ శివారులో మేతకు వెళ్లగా కిందపడిపోయింది. కాపరి పశువైద్యాధికారి గోవర్ధన్‌ను సంప్రదించగా అందుబాటులో లేక గొర్రె మరణించింది.

పోషకాహారంపై అవగాహన

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్, శాంతినగర్ తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏఎన్ఎం భాగ్య ఉన్నారు.

ఆయుష్మాన్‌భారత్ సేవలను వినియోగించుకోవాలి

కడెం: ఆయుష్మాన్ భారత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ నిరీక్షణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబెల్లాల్‌లో ఆయుష్మాన్‌భారత్ ద్వారా అందించే వైద్య సేవలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

నిర్మల్‌చైన్‌గేట్: భగవాన్ శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని 19 మండలాల్లోని వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఆ సమితి ప్రతినిధులు తెలిపారు. టైం వేస్ట్ ఈజ్ ది లైఫ్ వేస్ట్ అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో గెలిచినవారికి బహుమతులు ఇస్తామన్నారు.

నూతన నియామకం

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా సలీంఖాన్, పట్టణ అధ్యక్షుడిగా షౌకత్‌పాషాలు నియామకమైనట్లు ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దయానంద్, షబ్బీర్‌పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని అందాకూర్ మాజీ సర్పంచ్ సాగర్‌రావు తల్లి సుశీల మంగళవారం రాత్రి మృతిచెందగా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బుధవారం పరామర్శించి మృతికి గల కారణాలు తెలుసుకున్నారు.

16న ఎన్‌రోల్మెంట్ డ్రైవ్

నిర్మల్‌రూరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్‌లో ఉద్యోగాల కోసం ఎన్ రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 8247838789 నంబర్లలో సంప్రదించాలన్నారు.